కథా నిలయం
1482
శ్రీకాకుళం

# వినిపించని వేదన

కాలేజి విడుపుగంట కొట్టారు. అంతా బిలబిలలాడుతూ బయటికి వస్తున్నాము; మెట్లు దిగుతుండగా వాసంతి నాకు ఎదురౌతూ కనిపించింది. ఆమె నాకు దూరపుచుట్టం. చుట్టరికంకన్నా మా యిద్దరికీ స్నేహమే ఎక్కువ. నాకంటే చదువులో ఒకేడు ముందుండేది. గత సంవత్సరమే బి.ఎ. పూర్తిచేసి కూచుంది. వాళ్ళనాన్న బీదపంతులు. ఎలాగో తంటాలుపడి ఆ చదువు చెప్పించాడు. ఏడాదినించీ వివాహ ప్రయత్నంలో ఉన్నారు. కాని కలిసిరావడంలేదు. ఈ రోజు మేము సినిమా ప్రోగ్రాం వేసుకున్నాం. "ఇంతలో మళ్ళీ కాలేజీకి ఎందుకువస్తోంది?" అనుకున్నాను. ఇంతలోనే వాసంతి నన్ను సమీపించింది. చెప్పింది. "సినిమాకు రావడం లేదే. ఏం చెయ్యను. ఇప్పటికిప్పుడే మానాన్న ఖమ్మం ప్రయాణం కట్టమన్నారు.

"అదేమిటే; మళ్ళీ ఏమన్నా సంబంధాలాఏమిటి?" అన్నాను నడక సాగిస్తూ".

"అవునే ఎవరో పురుష పుంగవుడు నన్ను చూస్తాడట, 'పిల్లను తీసుకు వచ్చి చూపించండి' అని కబురు చేశారు. ఏమిటోనే; ఇంత వస్తువులాగా ఎంతమంది ఇలా చూడడమో. నాకు నిజంగా మన సంప్రదాయాలంటే అసహ్యం వేస్తోంది. ఏం చేస్తాం? నాన్న కష్టం చూడలేక అన్నిటికీ ఒప్పుకుంటున్నాను."

ఇది వింటుంటే నాకు వళ్ళు మండింది. "అబ్బ, చాలా అందంగా వుంది. ఆ వరుడికి సిగ్గెగ్గూ లేదే? ఇదంతా సంప్రదాయమా? ఆడ పిల్లని అంతదూరం తీసికెళ్ళి చూపిస్తే ఆ మగవాడు చూస్తాడా? ఏం కుంటి వాడా-తను రావడానికి వంట్లో శక్తి లేనివాడా?" అన్నాను ఆవేశంతో.

"ఏం చేద్దామే? ఇది వాస్తవిక జీవితం; ఉపన్యాస వేదిక కాదు మరి. సంప్రదాయాలు ఈనాటికి ఇలా తయారయానాయి. ఆడది అన్నీ సహించి వుండాల్సిందే," అన్నది వాసంతి ఉదాసీనంగా.

"ఇదా? ఇదంతా మన సంప్రదాయం అంటే నేనొప్పుకోను. పూర్వం మీ అమ్మాయిని చేసుకుంటాం. మీతో సంబంధం కలుపుకోవాలని ఉంది అంటూ వరుడి తల్లిదండ్రులే ఆడపిల్ల ఇంటికి వచ్చి వియ్యం అడిగేవారట. ఇది ఎంత ధీరలక్షణంగా కనిపిస్తుంది! ఇప్పటి యువకుడో, "పిల్లను మా ఇంటికి తీసుకువచ్చి చూపించండి" అంటున్నాడు. ఇది మర్యాదకాదు. ఇందులో దర్జాకూడా లేదు. చేతకాదు, కదలలేడు పాపం అనడానికిలేదు. కేవలం ఇది స్త్రీల నిస్సహాయ పరిస్థితిని కనిపెట్టి సాగించుకునే దౌర్జన్యంఅంతే, ఇటు అధునికమైన సమానతా భావానికీ సున్నాచుట్టి అటు సనాతనమైన మర్యాదలకూ భ్రష్టులై, ఉభయత్రా కొరగాని వెకిలితనం ఇది."

వాసంతి నా ఉపన్యాసం విని ప్రశాంతంగా నవ్వింది. "సరేలేవే; నేను పోతున్నాను, ఏమీ అనుకోకుమరి" అంటూ వాళ్ళ వీధివైపు మళ్ళింది.

ఇదంతా ఆలోచిస్తూ చికాకుగా ఇంటికివచ్చాను. హాల్లో మా "ప్రక్కింటి పిన్నిగారు" తీరిగ్గా కూర్చుని కబుర్లు చెప్తోంది. ఈ పిన్ని

గారు మాకింకా కొత్తే. ఏ పదిరోజులయింది, వాళ్ళు మా ప్రక్క ఇంట్లోకి మారి. పోయి గదిలో పుస్తకాలు పడేసి, అమ్మమ్మ సిద్ధం చేసి ఉంచిన కాఫీ తాగేశాను. ఒక నిమిషం విశ్రాంతిగా కూర్చుందామని మళ్ళీ హాల్లోకి వచ్చి సోఫాలో కూలబడ్డాను.

కళ్ళు పెద్దవిచేసి, ముక్కు మీద వేలేసుకుని, ఎవర్నో ఆక్షేపిస్తూ 'పిన్నిగారు' అంటోంది, "ఆ పెద్దమనిషి లంచాలు తీసుకుంటాడుగా... బ్లాకు మార్కెట్ వాళ్ళంతా బోలెడు డబ్బిస్తారుట. ఏమిటో నమ్మా పాపిష్టిడబ్బు...."

నా మెదడులో వివాహసమస్యలే ఇంకా ఊరకలు వేస్తున్నాయి. ఉపన్యాస ధోరణిలో వెంటనే అనేశాను, "లంచాలుతీసుకోడం, చీకటి బజారు వ్యాపారం చెయ్యడం- ఇవి. ఇంకో పచ్చనిసంసారానికి చిచ్చు పెట్టి, వాళ్ళ నెత్తురుపీల్చి కట్నాలు తీసుకోడం కన్న చెడిపోయినాయా?"

దాంతో ఆవిడ అదోలాగా అయిపోయింది, "అదేమిటమ్మా! నలుగురు పిల్లలున్నవాళ్ళు మగపిల్లలకు కట్నాలు తీసుకోకపోతే ఎలా? మళ్ళీ కూతుళ్ళకు కట్నాలు పొయ్యవద్దా ఏమిటి..." అన్నది విసురుగా.

నేనూ ఆవేశంతోనే బదులుచెప్పాను, "కట్నాలుపొయ్యడం ఎంత బాధో తెలిసిన వాళ్ళు వేరే వాళ్ళ తల్లిదండ్రులను ఎందుకు పీడించాలి? అనడమేగాని, కొడుకుల పెళ్ళికి తీసుకున్న కట్నాలు కూతురు పెళ్ళిదాకా కూర్చుంటాయా? కష్టార్జితం కాదుగా; తేరగా వచ్చిన సొమ్ము. జోరుగా ఖర్చు పెట్టేస్తారు. ఐపోతుంది. తీరా కూతురు పెళ్ళి చెయ్యొచ్చేసరికి ఏ మార్వాడీలనో ఆశ్రయించి నలిగి నాశనం కావాల్సిందే. మా స్నేహితురాలు

సరళ ఉందిగా. వాళ్ళన్న తనకు నచ్చినా కట్నం గిట్టడం లేదని అయినా ఎళ్ల అమ్మాయిని చేసుకోలేదు. "మా చెల్లి పెళ్ళి కావాలి. దానికోసమైనా నేను కట్నం తీసుకోవాలి," అంటూ ధర్మపన్నాలు చెప్పాడు. చివరికి ఇంకో పిల్ల తండ్రిదగ్గర పొలం అమ్మించి నాలుగు వేలు వరకట్నం పట్టించాడు. నాలుగేళ్ళయినా కాలేదు. ఇప్పుడు సరళకి సంబంధం నిశ్చయమైంది. బేరం సెటిల్ చేసుకుని వెయ్యి రూపాయలు "అడ్వాన్సు" చెల్లించారు. అంతే. అప్పుల అన్వేషణలో అలమటిస్తున్నారు. అటు కాబోయే అత్తగారూవాళ్ళూ చాలా ఘటికులట! "యేసంగతి తొందరగా తేల్చండి" అంటూ గొంతుమీద కూర్చున్నారట. యేం చేస్తారు? "నా చెల్లి పెళ్ళి కోసం" అని గొప్పగా తీసుకున్న నాలుగువేలూ యేనాడో ఎందుకో తెలియకుండా హారతి కర్పూరంలా హరించుకుపోయినై. పోనీ చక్కగా చదువుకుంటున్నదిగదా అంటే ఆ కాస్తా మాన్పించారు..."

"ఏం పాపం చదివించుకోలేకపోయారూ సరళను? ఈ పెళ్ళి తాపత్రయమంతా తప్పేదిగా!" అంది పిన్నిగారు నా మాటకు అడ్డంవచ్చి. ఉప్పుతున్నట్లుగా

నేనన్నాను, "ఎలా చదివిస్తారు? ఎక్కువ చదివిస్తే పెద్దచదువు వాణ్ణి తేవాలిట. పెద్ద చదువువాడంటే మాటలా? కట్నం అంతఎత్తున పెట్టలేరట. కనక మాన్పించారు ..హాయిగా చదువుకోనసాగినా, నిశ్చింతగా ఏ ఉద్యోగమో చేసుకుంటూ బ్రతికేది. దాన్ని ఎటూకాకుండా చేశారు. పెళ్ళి చెయ్యలేక కుళ్ళికుళ్ళి చస్తున్నారు. ఈ కట్నం ఇచ్చేవాడికి విధిలేదు. ఆ తీసుకునేవాడికి బుద్ధిలేదు..."

నా దీర్ఘ ఉపన్యాసం వింటూనే పిన్నిగారు, "ఉద్యోగాలు చేసి ఊరేగుతారట! ఈ కాలపు ఆడవాళ్ళకి పెళ్ళెళ్ళెందుకో?... ఇక పోయి వస్తానమ్మా!" అంటూ విసురుగా వెళ్ళిపోయింది.

ఆవిడకు అంతకోపం ఎందుకు వస్తోందో నాకు అర్థంకావడంలేదు: "అలా వెళ్ళిపోతుందేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా అమ్మమ్మకేసి చూస్తూ.

అమ్మమ్మ నన్ను కోపంగాచూస్తూ అంది, "చాల్లే ఊరుకోవే! వాగకుండా కూర్చోలేవుగద."

"ఇప్పుడేమైందమ్మా, అంత కోపానికి?" అన్నాను వింతగా చూస్తూ.

"ఏమైందేమిటే-ఆవిడేనే మీ స్నేహితురాలు సరళకి కాబోయే అత్తగారు! ఎడ్వాన్సు తీసుకోవటమనీ, బుద్ధిందనీ, హద్దులేకుండా అలా మాట్లాడటమేమిటి నువ్వు?"

ఒక్కక్షణం నాగుండె ఆగినంతపని అయింది. కానీ వెంటనే సంతోషమనిపించింది ఈ సంగతి ముందే తెలిసివుంటే ఇంత నిక్కచ్చిగా అనలేకపోయేదాన్ని. "వరకట్నాల క్లాసు మార్కెట్టులో వెయ్యి రూపాయలు అడ్వాన్సు పుచ్చుకోవడమేంవిటి! తక్కినసొమ్ము ముట్టేనే ఆ పురుషపుంగవుడితో - అంటే తనకొడుకుతో, వధువు మెడలో తాళి కట్టిస్తుందిట. ఈవిడసరే, ఆ వరుడెంత అభిమానంలేనివాడో...!" అన్నాను అమ్మమ్మతో.

"నోరు మూసుకోవే! నీకేం చేటూపాటూ తెలియకుండా ఉంది. లోకం అంతా ఇలానేఉంది. ఒక్క మీ నసాళకే వచ్చిందాఏమిటి?" అంటూ వత్తులు చేసుకోడంలో మునిగిపోయింది అమ్మమ్మ.

\+ + +

వాసంతి కనపడక అప్పుడే వారంరోజులయింది. క్రొత్త సంబంధం ఏమైందో తెలియదు. ఆనాడు ఆదివారం. అనుకుంటుండగానే వాసంతి వచ్చింది. "ఏమిటే వాసంతి! ఎక్కడా జాడలేవు? రా. కూర్చో" అని ఆహ్వానిస్తూనే, "ఏమైందే నీ ఖమ్మం ప్రయాణం?" అంటూ ప్రశ్నించాను ఆత్రంగా. ఆమె నిశ్శబ్దంగా ఒక కాగితం నా కందించింది. అది ఉత్తరం. చివర తన సంతకమే ఉందే! అంటే వాసంతి వ్రాస్తున్న ఉత్తరమే. ఎవరికి? ఉత్సాహంతో చదివాను.

"అయ్యా,

మీ పెద్దలు వ్రాసిన ఉత్తరం అందింది. "మావాడికి మీ పిల్ల చాలా నచ్చింది. సంబంధం కలుపుకోవటంలో మాకేమీ అభ్యంతరంలేదు అంటూ వ్రాశారు. ధన్యవాదాలు. ఐదువేలు కాకపోయినా నాలుగువేలతో పాటు అన్ని లాంఛనాలు నెరవేరిస్తే, సరిపెట్టుకోడానికి సిద్ధమే. ఏ సంగతీ ఇక మీరే తేల్చి వ్రాయండి" అనే మీ పెద్దల ముగింపువాక్యంలోనే మీరు మాకు అందకుండా పోయారు. అంతడబ్బూ, అదనంగా లాంఛనాల శీర్షిక క్రింద ఉన్న కానుకలూ ఇవ్వగల స్థితికి మా కుటుంబం నోచుకోలేదు. అంత కష్టంతో అప్పుయాత్రకు ఉపక్రమించిన మా నాన్నగారిని తెగించి ఆపివేశాను. ఎలాగైనా ఆధనరాశిని ప్రోగుచెయ్యడానికి తన

సౌఖ్యం తన కుటుంబం భవిష్యత్తూ-అంతా కుదువబెట్టాలనే ఆయన ఆత్రం చూస్తే నాకు నిజంగానే దుఃఖం వచ్చింది. ఇంకా బ్రతికి బట్టకట్టవలసిన తమ్ముళ్ళూ చెల్లాయిలూ నాకు ఉన్నారు-కడతేర్చవలసిన చిన్న పిల్లలు"

"అయ్యా! అరమరిక లేకుండా విద్యావంతులైన మీరే ఆలోచించండి. గుండెమీద చేయివేసుకుని, కళ్ళల్లో పెట్టుకుని పెంచి తనబిడ్డ భావిసుఖం ఊహించుకుని కలలుగనే ప్రతి తండ్రి-కూతురుకోసం త్యాగం చెయ్యడానికే, ఆమె సుఖమయ జీవితానికి చేతనైనదంతా చెయ్యడానికే యత్నిస్తాడు. ఇది ఆతనికెవరూ చెప్పనక్కర్లేదు. కాని చేతకానిది ఎక్కడనించి చెయ్యగలడు? ఈనాడు నా తండ్రి కూతుర్ని యేదో మంచి కుటుంబంలో పడవేసి, సుఖంగా ఉంటే చూసుకుందామని ఉవ్విళ్ళూరుతూ తలకు మించిన బరువెత్తుకుని తరతరాలు మళ్ళీ లేవకుండా తనసంసారం, తక్కిన పిల్లల భవితవ్యం అంతా అంధకారంలో కూలద్రోసుకోడమేగదా! ఇలా అయిపోయిన వాళ్ళను మనమెందర్ని చూడ్డంలేదు లోకంలో?

లక్ష్మీ కటాక్షం ఉండి చేతనైన తండ్రులు కూతురికోసం ఎన్నేసి కానుకలిచ్చినా ఎవ్వరికీ ఆక్షేపణలేదు. కాని గంపెడుసంసారం ఈడుస్తుంటే యే మధ్యతరగతి మర్యాదస్తుడో అయితే, "తగిన వరుణ్ని" చూచి 'తగని' కట్నం ఇచ్చి బ్రతుకంతా అప్పులపాలై, సంసారం పాడుచేసుకోవలసిందేనా? ఇదంతా చూస్తూ ఆ "తగినవరుని ఇంట్లో కూతురు హృదయం మాత్రం యేంసుఖం ఎంచుకుంటుంది?

మశూచికీ, మహామారికి బలి అయ్యేవాళ్ళసంఖ్య ఇన్ని లక్షలనీ, ఇన్ని కోట్లనీ లెక్కఉంటుంది. కాని వరకట్న పిశాచానికి ఎన్నెన్ని మధుర జీవన స్వప్నాలు మట్టిలో కలిసి రక్కసి పొదలు మొలిచాయో! లోకానికి

కనపడకుండా, కిక్కురు మనకుండా బలిఅయ్యే కోమలప్రాణులుఎన్నో కుమిలిపోయే మనసులెన్నో, కూలిపోయే పెళ్ళిళ్ళు ఎన్నో ఎవరు చెప్పాలి?

"ఆడవాళ్ళ డబ్బుకోసం కక్కుర్తిపడే నీచబుద్ధిగలదేశం ఏనాటికైనా తన కాళ్ళపైతాను నిలబడగలుగుతుందా? పురుషార్థంతో, ఆత్మవిశ్వాసంతో "నేను ఆర్జించుకుంటాను" అని ఉద్యమించే ధీరులేకదా దేశానికి గర్వం!

"ఈ డబ్బు సమస్య మనిద్దరికీ మధ్య భార్యాభర్తలుగా బ్రతుకు సాగించడానికి తిరుగులేని అవరోధంగా ఏర్పడింది. మీరు చేతకానివారుకారు. ఉద్యోగం చేసి సంపాదించుకుంటున్నారు. ఒకళ్ళని 'దేహి' అనవలసిన పని మీకులేదు. మాకు తెలిసినంత వరకూ ఏదో దర్జాకోసం కట్నం తీసుకోవలసిందేకాని, మీ కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు లేవనే అనుకుంటాను, నేను మీకు అన్ని విధాలా నచ్చానని ఉత్తరంలో పేర్కొన్నారు. ఈ 'నచ్చ'డానికి అర్థం ఏమిటో తెలుసుకోలేక పోతున్నాను. నచ్చితే ఇక మీకు అడ్డం ఏమిటి? డబ్బుకావాలి; అంతేనా?...అంటే మీకునచ్చిన సందర్భంలోకూడా స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం మీకు లేదేమోనని సమాధానం చెప్పుకున్నాను. ఒకవేళ మీపెద్దలకు డబ్బే ముఖ్యమైతే ఇంత చదువుకున్నదాన్ని-ఉద్యోగం దొరక్కపోదు. మీ అనుమతితో ఉద్యోగంచేసి సంపాదించ మనవచ్చు: నేనందుకు సంతోషంగా సిద్ధమవుతాను. కాని మీరడిగిన చెల్లింపులుమాత్రం అసాధ్యమైనవి. కులమూ, గుణమూ ఇచ్చినంతగా దేవుడు మాకు ధనమీయలేదు.

"అబలల ఆవేదన కొంచెం ఉదారహృదయంతో అర్థంచేసుకోడానికి ప్రయత్నించండి. నైరాశ్యంతో ఇలా వ్రాస్తున్న నా సాహసానికి

మన్నించండి ఏమేమో వ్రాశానని కోపగించుకోవద్దు. ఇదంతా మీ గురించి ఆక్షేపణకాదు. నచ్చికూడా ధనంచేత వంచింపబడుతున్న నిస్సహాయురాలి ఆవేదన. అంతే, సెలవు.

"వాసంతి"

చదవడం ముగించి ఆశ్చర్యంతో వాసంతిని అడిగాను, "యేమిటే ఈ ఉత్తరం? నిజంగానే పంపించేస్తున్నావా ఇది."

వాసంతి చలించకుండా అంది, "పోస్టు చేసేశాను. నాన్నకు చూపించాలని కాపీ ఉంచుకున్నాను. ధైర్యం చాల్లేదు నీకు చూపిస్తున్నాను...ఇంట్లో పరిస్థితులేమీ బాగాలేవే. ఏం చెయ్యను?"

నేను దానివైపు విచిత్రంగా చూస్తూ అన్నాను, "సరే! అయిపోయిందిగా! మంచిపనే చేశావనుకుంటాను"

కొంచెం సేపు కూర్చుని వాసంతి వెళ్ళిపోయింది.

× × ×

పదిరోజులదాకా నాకు వాసంతి కబురే తెలియలేదు. ఆ రోజు సాయంత్రం కాలేజీనుంచి వచ్చేసరికి నాకోసం సరళ ఎదురుచూస్తోంది. తనకి కాబోయే అత్తగారు అంటే మా ప్రక్కింటి పిన్నిగారితో నాకు జరిగిన వాదం గురించి మా అమ్మమ్మ చెప్పిందట. అది ఒకటే నవ్వడం. అయితే నీ దృష్టిలో లంచమూ, కట్నమూ ఒకటేనా యేమిటే? .. మరి ఇంత బహిరంగంగా జరిగే వీటిని ప్రభుత్వం ఎందుకు అరికట్టలేక పోతోందో" అన్నది.

నేను అందుకున్నాను. "ఎలా అరికడతావే? ఇలాంటివి శాసనాలతో అయ్యే పనులా? సమాజ దృక్పథంలో మార్పు రావాలి. విద్యావంతుల్లోనే మనఃపరివర్తన రావాలి. మరో మార్గం లేదు అంతే.

ప్రసంగవశాత్తు అడిగాను "వసంతి కనబడి చాలా రోజులైంది. దాని సంగతేమన్నా తెలుసా?"

"యేమోనే, దాని బ్రతుకంతా తీరూవారీ లేకుండా అయింది. ఏదో ఉత్తరం వ్రాసిందటగా వాసంతి. దానికి వియ్యంకుడు మండి పడుతూ, "మీ సంబంధం మాకు అక్కర్లేదు అని వ్రాశాడుట. ఈ ఉత్తరం వచ్చేదాకా వాసంతి నాన్నకి సంగతే తెలియదుట."

"అయ్యో ఎంత పని జరిగింది? పాపం వాళ్ళనాన్న ఎంత నిరాశ పడ్డాడో. జీవితమంతా జీతంలో దాచిపెట్టిన ప్రావిడెంటు ఫండంతా ఓ రెండువేలదాకా కట్నంకే తీసి దగ్గర పెట్టుకున్నాడుగా?"

"అంతేకాదు, తక్కిన డబ్బుకోసం తాపత్రయపడుతూ, అటు వియ్యంకుడి పేరిట "మూడు వేల రూపాయలతో సరిపెట్టుకుని ఎలాగైనా తన సంబంధం నిలుపవలసిందని ప్రాధేయపడుతూ మొన్ననే ఉత్తరం కూడా వ్రాశాట్ట. ఇంతలో ఈ జవాబు వచ్చిందని..."

"అయ్యో వాసంతి ఎంత తొందరపడింది, వాళ్ళనాన్న ఏమన్నాడు?" అన్నాను ఆత్రంతో, "ఏంచేస్తాడు? చేతకాని కోపంలో చెయ్యి కూడా చేసుకున్నాడట! తనకోసం ఇన్ని అవస్థలుపడి పెళ్ళిచెయ్యవద్దని వాసంతి ఏడుపు...ఏమిటో ఆ సంసారమంతా గోలగా ఉందే, అల్లారు ముద్దుగా పెంచుకొన్న బిడ్డను కోపంలో కొట్టాడేగాని అన్నం నీళ్ళులేకుండా ఆ తండ్రి అలమటిస్తున్నాడు..."

ఇదంతా వింటుంటే నా మనస్సు వికలమై పోయింది. సంభాషణలో మరికొంతసేపు గడిచింది. చివరికి అడిగాను. "మరి నీ సంగతి యేమైంది మా ప్రక్కింటి పిన్నిగారు ఏమంటున్నారేమిటి!"

అది బాధగా చెప్పటం మొదలుపెట్టింది. "యేముందే, నన్నెటూ కాకుండా చేశారు. చదువుకుని ఏదైనా ఉద్యోగంలో చేరినా బాగుండేది. ఇప్పుడు అదా! నన్ను చెక్కించటం కూడా అయిందిగా! తక్కిన డబ్బు ఎవరో తెలిసిన వర్తకుడు ఇస్తానన్నట్టు. వడ్డీకి తెస్తున్నారు. లగ్నాలుకూడా పెట్టుకుంటున్నారు, అన్నయ్య జీతంలో వాయిదాల మీద తీరుస్తాడట.... మాకున్న ఆస్తి ఆ ఇల్లు ఒక్కటీ తాకట్టులో పడుతుంది. ఇదీ పరిస్థితి."

సరళ వెళ్ళి పోయిన తర్వాత ఎంతోసేపు అలానే కూర్చున్నాను. వాసంతి సంగతి ఆలోచిస్తుంటే ఆరోజు నాకు నిద్ర పట్టలేదు. అర్ధరాత్రి తరువాత కొంచెం కన్నంటుకుంది. కల వచ్చింది. యేదో స్నేహలత సంఘం వాళ్ళ మీటింగుట! అందులో ఒక యువకుడు ఆవేశంతో ఎంతో బాగా మాట్లాడుతున్నాడు. నాకు ఎలాగో తెలిసింది, అతడే వసంతిని మెచ్చిన పెళ్ళికొడుకని.

"సోదరులారా! వరకట్నరోగం నేటి సమాజాన్ని పిప్పిపిప్పి చేస్తోంది. ఎటు చూసినా లంచం-కట్నం. ఈ రెండూ పిశాచాల్లా స్వైర విహారం చేస్తుంటే అంతా కళ్ళప్పగించిచూస్తూ ఏమీ చెయ్యలేని దశలో ఉన్నారు. లంచం ఇవ్వలేని వాడికి ఏసిఫార్సైనా పనిచేస్తుంది. కాని కట్నానికి తిరుగులేదు-ఎదురులేదు. దీన్ని అరికట్టటానికి ప్రభుత్వంచేసిన శాసనం హాస్యాస్పదంగా మారిపోయింది. ఇప్పుడు చీకటిబజారులో పడి ఈ భూతం మరింతవికృతరూపం ధరించింది.

'ఇచ్చే వాడు ఇస్తున్నాననిచెప్పడు. గుండెలు పగిలి చస్తున్నాసరే ఒక తీసుకుంటున్నవాడు తీసుకున్నట్లు అసలేచెప్పడు. పెళ్ళికి పది రోజుల ముందే కట్నంకాజేసి, చీకటి తెరల్లో ముఖందాచుకుంటాడు. ఇదేనా మన ఋషులు పుట్టిన పుణ్యభూమి?

'తమాషా ఏమిటంటే వరుడికెంత డబ్బుంటే వానిదాహం కూడా అంత హెచ్చిపోతుంది. ఎంతఎక్కువ చదువుకున్నవాడైతే వరకట్న ఉన్మాదమూ అంత రెచ్చిపోతుంది. ఎందుకలాంటి చదువు? ఒకచదువు కున్న స్త్రీఎదుట నేనూఒక ప్రయోజకుడనని నిలబడటానికి మనసెట్లా వస్తుందో చిత్రమే. నిజంగా అభిమానం ఎంతకరువైపోయింది ఈరోజుల్లో'
(కరతాళ ధ్వనులు)

"వరుడుగా కట్నాలు తీసుకుని ఒకళ్ళను చంపడం మళ్ళీ పెద్దయిన తర్వాత కట్నమివ్వలేక తానేచావడం - యేమిటీ నిరంతరమైన వ్యథ. ఎన్నాళ్ళీ విషాదగాథ? అందరూ బాధపడాల్సిన ఈ పరిస్థితి మాన్పి కట్నాలు లేని సమాజం సృష్టించుకోలేడా నేటిపురుషుడు? ఇది తన వ్యక్తిత్వానికి ఎంత కళంకమో నేటి యువకుడు గుర్తించాలి: హుందాతనం పెంచుకోవాలి. మానవ నిసర్గమైన డిగ్నిటీ మళ్ళీసాధించుకోవాలి. ('హియర్ - హియర్' సభలో కేకలు) ప్రేమ, అన్యోన్యత సాంప్రదాయం వెతుక్కోవలసిన దాంపత్యంలో, వరకట్నండబ్బుల కోసం కక్కుర్తిపడి గాలం వెయ్యడమా? ('సిగ్గు సిగ్గు') ఈనాడిది పురుషుల్లో ఒక అంటువ్యాధిలాగా ప్రబలిపోతోంది. దీనికి వారి అక్కలూ, చెల్లెళ్ళే బలి అవుతున్నారు. తేరగావచ్చే సొమ్ము ఆశించే నికృష్టమనస్తత్వానికి యువలోకం పాల్పడటం దేశానికి అరిష్టం అంటున్నాను.

"రవీంద్రుడు మా కవీంద్రుడని వేదికలమీద ఉగ్గడించే యువకులు ఆయన చిత్రించిన వరకట్నాల కరుణామయగాధలో ద్రవించిపోయారా? కన్యాశుల్కం వ్రాసిన మా గురజాడ అంటూ ఉపన్యాసాలు దంచే యువకులు ఎంతమందికి ఆ మాటఅనే అర్హతఉంది? బాపూజీపేరు మాటి మాటికి ఉచ్చరించే భారతీయ యువతరానికి ఆయన అసహ్యించుకున్న వరకట్నం మాకొద్దనే సాహసం ఎంతమందికి ఉంది? చెప్పేమాటలకూ, చేసేచేతలకూ పొంతనలేని హిపోక్రసీతో జాతిఏమవుతుంది ?("హియర్ హియర్")

"ఈనాడు తగిన భర్తను కాంక్షించే ప్రసక్తిలేదు యువతికి. నచ్చిన సతినిపొందే వతిలేదు వరుడికి. అంతా "కట్నాధీనం వివాహం"గా తయారైంది. పవిత్రమైన వివాహబంధం ఆశయాలన్నీ ఇలా కట్న పిశాచానికి బలిఅయిపోవడం సమాజానికి అనారోగ్యలక్షణం అవుతుందా? ఇదే నేటిసమాజానికి సవాలు. ఇదే యువలోకం ఆర్తితో మనకిచ్చే పిలుపు. మనమంతా సంస్కర్తల ఆశయాలకనుగుణంగా రూపొందాలని మనవి చేస్తూ విరమిస్తున్నాను. జైహింద్!"

ఆ గంభీరోపన్యాసం ముగియగానే అందరం ఆనందంతో చప్పట్లు కొడుతున్నాం. ఆ సభలో అప్పటిదాకా ఏ మూలనుంచో-పట్టలేని సంతోషంతో వాసంతి ముందుకుపోయి అతనితో చెయ్యికలుపుతోంది. ఆనంద పరవశమైన ఆమె ముఖం ఆసమయంలో నాకు ఎందుకో చాలావికృతంగాకనిపించింది? అందమైన వాసంతిముఖంచూస్తే నాకు నిజంగా భయంవేసింది. అదిరిపడిలేచాను. కళ్ళునలుపుకుంటూ నలువైపులా చూశాను...అప్పుడప్పుడే తెల్లవారుతోంది.

వాసంతిని కలుసుకోవాలనిపించింది. సాయంత్రం తప్పకుండా మా యింటికి రమ్మని పనిమనిషితో కబురుచేసి, కాలేజీకి బయలుదేరాను.

కాలేజీలో అడుగుపెట్టగానే వాళ్ళింటి దగ్గరే ఉండే స్నేహితురాలొకామె నాకోసం ఎదురుచూస్తోంది. పిడుగులాంటివార్త తెచ్చింది. "వాసంతి చచ్చిపోయింది తెలుసా?"

నేను నిర్ఘాంతపోయాను. ఆమె చెప్పింది, "రాత్రినూతిలోపడింది ...నిన్న సాయంత్రమే ఆమెతండ్రి ఏదో తాగాట్ట!... ఆసుపత్రిలో చేర్చారు. ఈ తెల్లవారి వాసంతిశవం నూతిలోతేలింది...." కళ్ళుతుడుచుకుంటూ, కొంతసేపటికి తేరుకుని మళ్ళీచెప్పసాగింది. "వాళ్ళంతా ఏడుపులు—మొత్తుకోళ్ళలో ఉన్నారు...పోస్టుమన్ వస్తే ఈ ఉత్తరంనేను తీసుకున్నాను...ఎక్కడిదో వాసంతి పేరునవచ్చింది...ఎవరికియ్యను?"

ఇదంతా నేను నమ్మలేకపోయాను. స్నేహితురాలికి తుదితర్వాత పొంగిపొర్లివచ్చే కన్నీరు ఆపుకుంటూ, ఇద్దరంకలిసి వెంటనే ఇంటికి వచ్చేశాము. నాకు వాసంతిని తల్చుకుంటే దుఃఖమాగలేదు. హఠాత్తుగా నా దృష్టి ఆమె చేతిలోఉన్న ఉత్తరంమీద పడింది. దానిమీద, పంపిన వారి పేరుక్రింద ఖమ్మం అనివ్రుంది. తటాలున అందుకుని కవరుచించి వణుకుతున్న చేతుల్తో ఉత్తరం తెరిచాను. ఒకొక్కఅక్షరం విద్యుత్ఘాతంలాగా నన్నుదహించివేస్తుంటే ఆసాంతం చదివాను.

"వాసంతీ,

నీ లేఖకు జవాబు ఇవ్వాలెన్నపట్టింది. మా తండ్రిగారిఉత్తరంతో నిరాశపడినన్ను నిందించుకొని ఉంటావుకదూ! అవును, ఆశ్చర్యంలేదు.

కానీ-ఏం చెయ్యను? ఆ విషయం ఇంతకంటేతక్కువ సమయంలో తేల్చుకోటం సాధ్యపడలేదు.

నేనిప్పుడు నిశ్చయం చేసుకున్నాను, ఏదిఏమైనా నాకు నీవే కావాలి. రెండుమూడు రోజుల్లో వచ్చి వివాహం నిర్ణయం చేసుకుంటాను.

నీ అభిప్రాయాలన్నిటితోను ఏకీభవిస్తూ, ఆదర్శ వివాహానికి నీ నుంచి ప్రేరణ పొందానని చెప్పడానికి గర్వంగావుంది.

ఇప్పుడింతకంటే ఏం వ్రాయను? మిగతావి కలుసుకున్నప్పుడు సమక్షంలోనే మాట్లాడుకుందాము.

నీవాడు కావాలని ఆశించే,

"మూర్తి"

"కొద్ది గంటల ముందు రావలసిన ఉత్తరం...ఆహా! విధి ఎంత వ్యంగ్యంగా కనిపిస్తుంది, వసంతీ. నీ వెంత అదృష్టవంతురాలివే!... నీఅదృష్టమే నిన్ను వెదుక్కొంటూ బయలుదేరింది. కాని ఆసంగతి తెలియకుండానే నీవీ లోకాన్నే తిరస్కరించి వెళ్ళిపోయావు. ఆపట్టని అదృష్టం నిన్ను వెదుక్కొంటూ ఇకఎప్పటికీ అలానే మిగిలిపోతుంది...వాసంతీ... నీ అమాయకహృదయం ఎంత క్షోభించిపోయిందో!... వాసంతీ;... వాసంతీ:"... తెరలు తెరలుగా వచ్చే ఈ భావాలతో పెద్దపెట్టున శోకం నన్ను ఆవరించింది.

కథ ముగించడానికి ఇంకేముంది. నాలుగు సంవత్సరాల క్రిందటి గాథ నేను చెప్పింది. వాసంతి తండ్రికి మతిపోయింది. సరళ తండ్రి కొంపాగోడు కోల్పోయి జీవచ్ఛవంలా కాలం గడుపుతున్నాడు. సంసారం అంతా గుమాస్తాపని చేసే సరళ అన్నయ్యమీద పడింది.

ఈనాడు వాసంతి తండ్రికి మతిలేదు. సరళ తండ్రికి గతిలేదు. సరళ అయినా సుఖంగా సంసారం చేస్తోందని మీరెలా అనుకుంటారు?

ఇది మన పవిత్ర భారతభూమి. ఇదే మన నవనాగరిక హైందవ సమాజం. వాసంతిలాంటి మంచిమనస్సుగల యువతులు చేసిన అపరాధ మల్లా-వారిక్కడ పుట్టటమే.

(ఆంధ్రజ్యోతి వారపత్రిక, 6-11-70)